ఉచిత న్యాయం కోసం శాశ్వత లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉచితంగా న్యాయం కోసం శాశ్వత లోక్ అదాలత్‌ని సంప్రదించాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు ఎంతగా ఉపయోగపడుతుందో పలు ఉదాహరణలతో వివరించారు. ఎటువంటి సమస్య ఉన్నా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. పోస్టల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణతో కలిసి ఉత్తమ సేవలు అందించిన పోస్టల్ సిబ్బందికి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ చంద్రశేఖర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడికి మద్దతుపై తేల్చాలి

- జిఒ ఇచ్చాకే జిల్లా పర్యటనకు సిఎం రావాలి
- రాష్ట్రస్థాయి జీడి సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

ప్రభుత్వం జీడి పంటకు మద్దతు ధర ఇస్తుందా? లేదా? అన్నది తేల్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జీడికి గిట్టుబాటు ధర, జీడి పంట సమగ్రాభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా పలాసలోని టికెఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిసిందని, జీడి పంటకు మద్దతు ధర, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లకు జిఒ ఇచ్చాకే రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జీడిపిక్కల దిగుమతులపై సుంకం తగ్గించడం వల్ల దిగుమతులు వెల్లువలా వచ్చి ఇక్కడి పంట అమ్ముడుపోవడం లేదని చెప్పారు. రైతులు కష్టపడుతుంటే, వ్యాపారులకు లాభం చేకూరే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలుస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిగుమతి సుంకం పెంచి రైతులను ఆదుకోవాలని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. కనీసం జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలోనూ ప్రస్తావించకపోవడం రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

కేంద్ర ప్రభుత్వం జీడి రైతులకు అన్యాయం చేస్తున్నా, వైసిపి, టిడిపి, జనసేన బిజెపి ప్రభుత్వానికి పల్లకి మోస్తున్నాయని విమర్శించారు. జీడి పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బందులు పడుతుంటే, ఈ ప్రాంతానికి చెందిన మంత్రి అప్పలరాజు వ్యాపారుల పక్షాన నిలబడుతున్నారని విమర్శించారు. కేబినెట్ సమావేశాల్లో ఒక్కసారైనా ఈ అంశంపై మాట్లాడారా అని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజుకు కమీషన్లు ముడుతున్నాయని, తాడేపల్లికీ వెళ్తున్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు కావడం లేదన్నారు.

గిట్టుబాటు ధరకు మార్కెట్ వ్యవస్థ

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ఇవ్వాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులకు మేలు చేయడంలో కేరళ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జీడి పంట అభివృద్ధికి బోర్డు, మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి ఉత్పాదకతతో పాటు దిగుబడి పెంచే చర్యలను చేపట్టాలన్నారు.

గిట్టుబాటు ధర వచ్చే వరకు పోరాటం

జీడి రైతులు ఆరు నెలలుగా మద్దతు ధర కోసం పోరాడుతుంటే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా దళారులు దోపిడీ చేసే విధానాలను బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే అంతా కలిసి సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ జీడిపిక్కలకు ధర లేదని మంత్రి అప్పలరాజును రైతులు అడిగితే, అంతర పంటలు వేసుకుంటే లాభం వస్తుందంటూ ఉచిత సలహా ఇస్తున్నారని మండిపడ్డారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతానికి బతుకుదెరువుగా ఉన్న జీడి పంటకు మద్దతు ధర కోసం పాలకులను ప్రశ్నించాలన్నారు. సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతులు, కార్మికుల పొట్టగొడుతోందని విమర్శించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి జీడి రైతులు పాలకుల చేతిలో దగా పడుతున్నారని, అంతా కలిసి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కొల్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రజా కళాకారులు హేమసూదన్ బృందం అభ్యుదయ గీతాలను ఆలపించారు. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, గంగరాపు సింహాచలం, నాయకులు ఎన్.గణపతి, పి.ప్రసాదరావు, బి.శ్రీరాములు, రైతుసంఘం నాయకులు కె.గోపీనాథ్, ఎస్.లక్ష్మీనారాయణ, జె.ప్రసాదరావు, హేమారావు చౌదరి, పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విఒఎలు, యూనియన్ నాయకులు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి
- అన్నిరకాల బకాయిలు చెల్లించాలి
- కలెక్టరేట్ వద్ద విఒఎల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, విఒఎల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. సిబిఒహెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల బకాయిలు తక్షణమే చెల్లించాలని, లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని విఒఎలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. విఒఎల ఉపాధికి నష్టదాయకమైన గ్రామ సమాఖ్యల విలీనాన్ని ఆపాలన్నారు.

సంఘాలను విడగొట్టడం కలపడం వంటి చర్యలు సెర్ఫ్ అధికారులు చేయడం సరికాదన్నారు. దీనివల్ల వేలాది మంది విఒఎలు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఎక్కువ సంఘాలున్న విఒఎల నుంచి తక్కువ సంఘాలున్న విఒఎలకు సర్దుబాటు చేయాలని, రాజకీయ జోక్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించడం లేదని, వారంతా ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎగా పనిచేస్తూ ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వయసు పైబడిన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలన్నారు. జెండర్, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలన్నారు. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు, విఒఎలకు లక్ష్యాలు నిర్దేశించే పద్ధతి ఆపాలన్నారు. గౌరవ వేతనం ఎం.ఎస్ అకౌంట్స్‌లో వేయకుండా చెల్లింపు చెక్కులు ఇవ్వాలని, వాటిపై సిసి, ఎపిఎం సంతకాలు లేకుండా చూడాలని కోరారు. రికవరీ పేరుతో వేతనాల్లో కోతలు ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, విఒఎ సంఘ నాయకులు జి.భవాని, డి.జోగారావు, కె.సీతమ్మ, ఎస్.లక్ష్మి, పి.రమాదేవి, జి.ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

జగన్ ఓటమి ఖాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌ను ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఉన్న రూ.లక్ష కోట్ల అవినీతి బురదను అందరికీ అంటించేందుకు వ్యవస్థలను అడ్డంపెట్టుకుని జగన్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఆధారాల్లేని కేసుల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందించిన చంద్రబాబును నిర్బంధించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు. నిన్నటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అన్నారని, నేటికీ ఆధారాలు చూపలేకపోయారని చెప్పారు. ఇప్పుడు అమరావతిలో లేని రింగ్ రోడ్డులో అవినీతి జరిగిందని కేసు పెట్టి చంద్రబాబుతో సహా లోకేష్‌ను ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లకు పాల్పడిన వ్యక్తి జగన్ అని, రానున్న రోజుల్లో ఆ స్కామ్‌లన్నీ బయటపడతాయన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై విచారణ చేపట్టాలని బిజెపినే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిందన్నారు. దమ్ముంటే మద్యం స్కామ్‌లో విచారణను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. చంద్రబాబును అరెస్టు చేస్తే ముఖ్యమంత్రికి తెలియదని చెప్పడానికి సిగ్గుపడాలన్నారు. సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బొనిగి భాస్కరరావు, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, సింతు సుధాకర్, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే తప్పుడు కేసులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి : ఓటమి భయంతోనే వైసిపి ప్రభుత్వం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టు చేసిందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్‌లో అక్రమాలు జరిగాయని నెల రోజులుగా గొంతు చించుకుంటున్న వైసిపి నేతలు ఒక్క రూపాయి కూడా నిరూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. వైసిపి నేతలు అవినీతి అంటూ గొంతు చించుకుంటున్న ఫైబర్ గ్రిడ్ కోసం రూ.250 కోట్లు ఖర్చు పెడితే రూ.900 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. చంద్రబాబుపై పెట్టిన పెట్టిన కేసు రిమాండ్ రిపోర్ట్ పేజీ నంబరు 16లోని ఒక పేరాలో రూ.145.37 కోట్లని, మరో పేరాలో 290 కోట్లని, పేజీ నంబర్ 21లో అసలు ఆ సొమ్ము ఎటు వెళ్లిందో తమకు తెలియదని సిఐడి చెప్పడం ఈ కేసు ఎవరి స్వార్థం కోసం పెట్టారో తెలుస్తోందన్నారు. ఇటువంటి అక్రమ కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదని, తాము ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, పిరియా సూర్యారావు, కిమ్మోజు కుమారస్వామి, కిమ్మోజు యోగి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ చెల్లించకపోవడం దారుణం


వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

ఆమదాలవలస : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పదో తేదీ వరకు పెన్షన్ చెల్లించకపోవడం దారుణమని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. పెన్షనర్లపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ పట్టణంలో గాంధీ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు, కోశాధికారి హెచ్.వి సత్యనారాయణ, కార్యదర్శి పి.భానోజీరావు, ఉపాధ్యక్షులు ఎన్.చంద్రశేఖరరావు, బి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికే ప్రథమ ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి పంచాయతీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు ఎంతో మేలు చేసే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అంతా వినియోగించుకోవాలని కోరారు. ప్రజా వైద్యాన్ని ఇవాళ ఎక్కువ మందికి చేరువ చేస్తున్నామని, ఆ ఫలాలన్నీ పేదలకు అందుతున్నాయని చెప్పారు. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అన్నీ పేదలకు అనుసంధానమయ్యాయని తెలిపారు. వీటి వెనుక ఉన్న మంచి ఉద్దేశాన్ని గుర్తించాలని, ప్రజా వైద్యంపై నమ్మకం పెంచుకోవాలని కోరారు. వ్యాధి బారిన పడిన వారిని చేయి పట్టుకుని నడిపిస్తూ ఆ వ్యాధి నయమయ్యే వరకు వారికి ఉచితంగా వైద్యం నుంచి మందుల వరకు అన్నీ అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలను ఆరోగ్యవంతులని చేయడమే లక్ష్యమన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల ఆధారంగా రోగులకు చికిత్స అందించడమే కాకుండా ఇంకా ఏవైనా వ్యాధులు ఉంటే మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, గంగు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ

మాట్లాడుతున్న డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం, రణస్థలం రూరల్

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జె.ఆర్‌పురం, జలుమూరు పోలీస్‌స్టేషన్లతో పాటు శ్రీకాకుళం రూరల్ సర్కిల్ కార్యాలయాలను మంగళవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, మహిళలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు ఎక్కడా లేదని, ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమ రవాణా సాగుతోందని చెప్పారు. అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టామన్నారు. ఒడిశా సరిహద్దులో మూడు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, వీటితో పాటు మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక ప్రకారం కార్యాచరణను రూపొందించి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. విద్యుద్దీపాలు లేని చోట ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు చెప్పామన్నారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహనాల ద్వారా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించామన్నారు.

గ్రామాల నుంచి జాతీయ రహదారికి వచ్చే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని నివారించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామస్థాయిలో ప్రతిరోజూ సందర్శించి అసాంఘిక కార్యకలాపాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు శృతి, బాలచంద్రారెడ్డి, సిఐ ఆదాం, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పు యువతతోనే సాధ్యం

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సామాజిక మార్పు యువతతోనే సాధ్యమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మెరుగైన సమాజం, సామాజిక మార్పు కోసం యూత్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌లు దోహదపడతాయని తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ కమిటీ జిల్లాస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సేవ చేయడం ద్వారా విద్యార్థులు, యువతకు మానవత్వం బోధపడుతుందని చెప్పారు. జూనియర్ రెడ్‌క్రాస్ (జెఆర్‌సి), యూత్ రెడ్‌క్రాస్ (వైఆర్‌సి)లో అధిక సంఖ్యలో విద్యాసంస్థలు, విద్యార్థులు చేరేలా కృషి చేయాలన్నారు. మిలియన్ సంఖ్యలో విద్యార్థులను జెఆర్‌సిలో చేర్చేందుకు గవర్నర్ లక్ష్యాన్ని నిర్దేశించారని, ఆ దిశగా పనిచేసి సామాజిక మార్పునకు నాంది పలకాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్ అందుబాటులో ఉందని తెలిపారు. ఐక్యత, నిష్పాక్షికత, స్వాతంత్ర్యం, సార్వత్రికత సూత్రాల ఆధారంగా రెడ్‌క్రాస్ పనిచేస్తోందన్నారు. యువతలో ఈ భావజాలాన్ని పెంపొందించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. సామాజిక స్పృహ ఉన్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. నెలకోసారి ఈ కమిటీ సమావేశమవుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సబ్ కమిటీ కన్వీనర్ పి.శ్రీకాంత్, ఆర్ఐఒ దుర్గారావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, బరాటం చక్రవర్తి, శంకరనారాయణ, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు మార్గదర్శక పత్రాలు ఆవిష్కరణ

రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు మార్గదర్శక పత్రాలను కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు శ్రీకేష్ లాఠకర్ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సభ్యత్వం నమోదు చురుగ్గా సాగాలన్నారు. గ్రామాలు, పట్టణాల పరిధిలో సంబంధిత అధికారుల ద్వారా సభ్యత్వాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సభ్యత్వం పొందిన వారందరూ తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేసిన సభ్యులకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందించనున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు.

త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కె.సి రెడ్డి

ఎచ్చెర్ల : వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి ఆదేశించారు. మండలంలోని ఎస్ఎంపురంలో గల ట్రిపుల్ ఐటిని మంగళవారం సందర్శించారు. యూనివర్సిటీలో తాగునీరు, పరిశుభ్రత, హాస్టల్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం చేపట్టిన పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మెస్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - లావేరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కోరారు. మండలంలోని గోవిందపురం పంచాయతీ పరిధిలోని ఇజ్జాడపాలెంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏ సేవలు అందజేస్తున్నామన్న వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రోగుల ఒపి సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, సర్పంచ్ పి.రాము, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI.
O.S. 36/2020

Between: **Bank Of India, Tekkali Branch,** Represented by it's Branch Manager, TEKKALI Village/Mandal in Srikakulam District.
--Plaintiff.

And: **Mindi Rajulu** --Defendant.

NOTICE TO THE SAID DEFENDANT

Mindi Rajulu, S/o. Appa Rao, At present aged about 38 years, Hindu, Door No. 14-5-6/1, Nandigam Vill / Mandal, Srikakulam District.

It is to inform you that the above said case/matter/suit i.e., O.S.36/2020 on the file of the Honourable Court of Junior Civil Judge, Tekkali in Srikakulam District is stands posted to **Dt: 12-10-2023** for your APPEARANCE, and you are to appear on the above said date before the said Honourable Court **at 10:30 AM,** in person or through your pleader/advocate, otherwise the above matter/case/suit will be decided against you. Hence, this notice.

//By order of the said Honourable Court//

KAJANA VENKATARAO
Advocate for the Plaintiff,
TEKKALI,
Cell: 9440196244,6301366017.

Tekkali,
Dt: 10-10-2023.

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI.
O.S. 37/2020

Between: **Bank Of India, Tekkali Branch,** Represented by it's Branch Manager,TEKKALI Village/Mandal in Srikakulam District.
--Plaintiff.

And: **Adapa Srinivasa Rao** --Defendant.

NOTICE TO THE SAID DEFENDANT

Adapa Srinivasa Rao, S/o. Malleswara Rao, At present aged about 59 years, Hindu, Door No. 4-17-1,Raipadu Vill. Tekkali Mandalam, Srikakulam District.

It is to inform you that the above said case/matter/suit i.e., O.S.37/2020 on the file of the Honourable Court of Junior Civil Judge, Tekkali in Srikakulam District is stands posted to **Dt: 12-10-2023** for your APPEARANCE, and you are to appear on the above said date before the said Honourable Court **at 10:30 AM,** in person or through your pleader/advocate, otherwise the above matter/case/suit will be decided against you. Hence, this notice.

//By order of the said Honourable Court//

KAJANA VENKATARAO
Advocate for the Plaintiff,
TEKKALI,
Cell: 9440196244,6301366017.

Tekkali,
Dt: 10-10-2023.

శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

గిరిజన రైతులకు అండగా ఉంటాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస

గిరిజన రైతుల అధీనంలో ఉన్న భూములను ఇతరులు ఆక్రమించుకుంటున్నారని, గిరిజలకు అండగా ఉంటామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కాశీబుగ్గలో మంగళవారం మెళియాపుట్టి మండలం పెద్దమడికి చెందిన గిరిజనులు తమ భూములను ఆక్రమణలకు గురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ మెళియాపుట్టి మండలం నందవ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 64/2, 64/2ఎ, 65/2, 68/1, 68/3ఎలో సుమారు 16 ఎకరాల భూములను 32 మంది రైతుల ఆదీనంలో ఉన్నాయని అన్నారు. వీటిపై ఇతర ప్రాంతాల వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల నుంచి ఆ భూములు మా ఆధీనంలో ఉన్నాయని, ఆ భూముల్లో జొన్న, కంది, చోడి, ఉలవలు, ఆరుతడి పంటలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. మా భూములు మాకే దక్కే విధంగా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జన్ని రామకృష్ణుడు, ఎస్.విమలకుమారి, పి.హేమ, పి.రోహిణి, టి.మహాలక్ష్మి, పి.కృష్ణవేణి, పద్మ, కమలకుమారి ఉన్నారు.

రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

రక్తదాన శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిమాండ్‌కు నిరసనగా ఇచ్ఛాపురం టిడిపి నాయకులు నిరసన దీక్షలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దీక్షా శిబిరం వద్ద రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆధ్వర్యాన ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు నందిక జాని, కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్, ఎన్.కోటి, పి.తవిటియ్య, రేయ్య జానకిరావు, బి.తిరుమల పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీన ఢిల్లీయాదవ్, కొండ శంకర్‌రెడ్డి, ఆసీ లీలారాణి, రమేష్, ఢిల్లీరావు, జెమ్స్ ఆస్పత్రి సూపర్‌వైజర్ చిన్నారావు పాల్గొన్నారు.

కార్డుదారులకు అసౌకర్యం కలగరాదు

పలాస : పౌరసరఫరాల రేషన్ కార్డుదారులకు అసౌకర్యం కలగకుండా డీలర్లు సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల అధికారి రవి ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇప్పటికీ సరుకులు విడిపించని కార్డుదారుల వివరాలు విడుదల చేయాలన్నారు. రేషన్ డీలర్లు లాగిన్‌లో డికెఆర్ ఇపాన్ డివైజ్లో డౌన్‌లోడ్ చేసుకొని ఎండియు ఆపరేటర్లు పంపిణీ చేయాలన్నారు. రోజూ విఆర్ఒ సంతకం తప్పనిసరిగా చేయాలన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

లావేరు : రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బూర్జ : పోషక పదార్ధాలను పరిశీలిస్తున్న నాయకులు

లావేరు: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జడాపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం వారు పరిశీలించారు ఈసందర్భంగా ప్రజలతో మాట్లాడారు. వైద్య సిబ్బందిని వివరాలు ఆడిగి తెలుసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్, సర్పంచ్ పిల్లా రాము, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బురాడ చిన్నారావు పాల్గొన్నారు.

రణస్థలం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కొచ్చెర్లలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానీ, ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ప్రతిఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలూ వైద్య సిబ్బంది అందజేస్తారని అన్నారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పౌష్టికాహార కూరగాయాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, డాక్టర్లు కృష్ణచైతన్య, రజని పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని శేతుభీమవరం సచివాలయం పరిధిలోని ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పాల్గొని రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపిటిసి కె.గోవింద, ఎంపిడిఒ కె.నిశ్చల, పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, వైద్యులు ప్రతిష్టశర్మ, హరితశ్రీ, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్ర చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో రోజుకు 10 వేలు మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని అక్కయ్యవలస పంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సంపతిరావు రాఘవరావు, సర్పంచ్ సుంకరి సుకన్య, ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వైఎస్ ఎంపిపిలు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని కంబాలరాయుడుపేట నిర్వహించి ఆరోగ్య సురక్షలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ వంక చిరంజీవి, ఎంపిటిసి కారి వెంకటరావు, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, సుధీర్, కె.ప్రత్యేష, ప్రభుత్వాస్పత్రి వైద్యులు వెంకటేష్, జగదీష్ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నరసాపురం, తోటాడ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్యసురక్షను కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దుక్క భూషణ్‌రెడ్డి, సునీత రామరాజు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని అయోధ్యపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో వైసిపి మండల అధ్యక్షులు పాల్గొన్నారు. సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, బన్నువాడ, ఆయోధ్యాపురం సర్పంచ్‌లు పోలాకి మోహనరావు, బగాది హరి ఎంపిపి ఎ.సరోజనమ్మ పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని కొరగాం, వైకుంఠపురం, తమ్మినాయుడుపేట పంచాయతీల్లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష విజయవంతమైంది. శ్రీకాకులం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు మాధురి, అక్కులపేట, గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మీనా కుమారి వసంత, పైడి రోజా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇఒ కె.జనార్ధనరావు వైద్య సహకారాన్ని అందించారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ ప్రసాదరావు నేత్రాలను పరీక్షించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు పోషక పదార్ధాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కరణం కృష్ణంనాయుడు, సర్పంచ్‌లు సత్యం, సుదిష్ట, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ ఎస్.రమణబాబు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని మోడల్ స్కూల్ వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎంపిపి ఎన్.దాస్ పాల్గొని రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతి, వైస్ సర్పంచ్ వెంకటరమణ, ఎంపిపి ధర్మారావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒ వరప్రసాద్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

పొందూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

టెక్కలి : పోషక పదార్థాలను పరిశీలిస్తున్న వసంతరావు

పొందూరు : పొందూరు ఒకటో నంబరు పాఠశాల ఆవరణంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యాన నిర్వహించిన ఆరోగ్య సురక్షలో 415 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మురళి, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైద్యులు జి.రమేష్‌నాయుడు, శివశంకర్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని పెదంచలలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.సునీల్‌కుమార్ 320 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, డిటి వి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ వి.రామారావు, వైస్ ఎంపిపి తలగణ శ్రీరాములు, గైనకాలజిస్టు రాజ్యలక్ష్మి, వైద్యులు శృతి, కీర్తి, దేవి పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సత్తా

శ్రీకాకుళం అర్బన్ : కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఇటీవల జిరగిన 4వ సౌత్ జోన్ పెన్కాక్ సిలట్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులక కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మంగళవారం మెడల్స్ అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులు పాట్నాలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. స్కూల్‌లో చదువుతో పాటు ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ యుద్ధకళలు ట్రైనింగ్ ఇప్పించడం వల్ల పిల్లలకు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రీడకు మినిస్టరీ ఆఫ్ స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు ఉండటంతో విద్యార్థులకు మెరిట్ ధ్రువపత్రాలపైఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సౌత్ జోన్ పెన్కాక్ సిలట్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పి.ఆదిత్యరాజు, ఎ.లలిత్‌మిదిన్, జి.వెంకట్ వరుణ్ బంగారు పతకాలు సాధించారు. ఆర్‌పి.గౌరవ్, జి.శ్రీశాంత్ సాయి రజత పతకాలు, ఎన్.చరిష్మా బి.కార్తికేయ కాంస్య పతకాలు సాధించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, అంధవరపు రమేష్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి, జిల్లా పెన్కాక్ సిలట్ అసోసియేషన్ అధ్యక్షుడు గ్రాండ్ మాస్టర్ రేగిడి దయమయ, ప్రధాన కార్యదర్శి కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

13న డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ మెదటి సంవత్సరం చదివేందుకు ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలలుగా ఆన్‌లైన్‌లో దరకాస్తులు పెట్టినప్పటికీ సీటు రాని వారు నేరుగా ఈ నెల 13న కళాశాల పని సమయంలో వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని అన్నారు. డిగ్రీలో బిఎస్‌సి, బిఎ, గ్రూపుల్లో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

నౌపడ : సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుతాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ చలమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జితేంద్ర మిశ్రా (ఫైల్)

స్థానిక మండపొలం కాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలనీకి చెందిన జితేంద్ర మిశ్ర (44) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండపొలం కాలనీలో ఉంటున్న జితేంద్ర మిశ్రో స్థానికంగా పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై మండపొలం కాలనీ నుంచి రాంగ్ రూట్‌లో టెక్కలి వస్తున్నారు. ఈ క్రమంలో టెక్కలి నుంచి నందిగాం వైపు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జితేంద్ర మిశ్ర తీవ్రంగాగాయపడ్డాడు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ప్రతమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి దుర్మరణం చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగన్నపాలెం చెరువులో మృతదేహం లభ్యం

బూర్జ : మండలంలోని సింగన్నపాలెంకు చెందిన గడ్డం నాయుడు చెరువులో మహిళ మృతదేహం మంగళవారం ఉదయం పోలీసులకు లభ్యమైంది. ఈ మృతదేహం పూర్తిగా ముబ్బిపోయి ఉంది. ఆమదాలవలస పట్టణం వెంగళరావు కాలనీకి చెందిన గంగమ్మ (60) మృతదేహంగా పోలీసులు గుర్తించారు. ఆమెకు భర్త అప్పారావు, ఇద్దరు కుమారులు రమేష్, వెంకటరమణ, కుమార్తె జయలక్ష్మి ఉన్నారు. నాలుగైదు నెలలుగా మతిస్థిమితం లేక ఎప్పటికప్పుడే బయటకు వెళ్లిపోతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా కనిపించలేదని తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

17 నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న స్థానిక కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలను అన్నిశాఖలు సంయుక్తంగా పనిచేసి విజయవంతం చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అందుబాటులో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అగ్నిమాపక శకటాలను ఆలయానికి అందుబాటులో ఉంచాలన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ యాజమాన్యం, సిబ్బంది మూడు రోజులు పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాహనాలు నిలిపేందుకు పలుచోట్ల పార్కింగ్ స్థలాలను చూసుకోవాలన్నారు. విఐపిలకు ప్రత్యేక మార్గం కల్పించాలని సూచించారు. యాత్రికులకు అందుబాటులో తాగునీటిని ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఐ.వి. రమణ, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, కొత్తమ్మతల్లి చైర్మన్ మాధవి, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంపిటిసి బోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

అక్రమ కేసులకు భయపడేది లేదు

టిడిపి ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వ్యవస్థలను అడ్డుపెట్టుకొని టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారని, దీనికి భయ పడేది లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డవలప్మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ కేసులంటూ ఒకదాని తరువాత మరొకటి పెట్టారని, అయినా చంద్రబాబు ధైర్యంగా ఉన్నారని అన్నారు. టిడిపి హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డవలప్‌మెంట్ ఏర్పాటు చేశారని, అయితే జగన్ రాజకీయ కక్షతోనే దానిని నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి లేకుండా చేశారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిచంద్రగుప్తా, బడ్డ నాగరాజు, కుత్తుం లక్ష్మణకుమార్, నాబెల్లి, శ్రీనివాసరావు, దశరథలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ఓటమి భయంతోనే సిఎం జగన్ వ్యవస్థలను అడ్డుపెట్టుకొని చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, రాష్ట్ర జలవనరల సంఘ మాజీ అధ్యక్షులు కర్రి అప్పారావు, వెలమల కామేశ్వరరావు, శిమ్మ నారాయణరావు, గొండు లక్ష్మణరావులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవాది సింహాద్రమ్మ, హనుమంతు అప్పలరాజు, వాన లక్ష్మి, నాళ్ల ఆదినారాయణ, చల్ల శ్రీనివాసరావు, పల్లి రాంబాబు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న గౌతు శిరీష

విజయసాయిరెడ్డిని కలిసిన అసమ్మతి నాయకులు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన అధికార వైసిపి అసమ్మతి నాయకులు లుకలాపు అప్పలనాయుడు ఆధ్వర్యాన జెడ్‌పిటిసి రాష్ట్ర ఉమాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బల్లాడా హేమమాలినిరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ బల్లాడా జనార్ధనరెడ్డి, ఎచ్చెర్ల వైసిపి నాయకులు పైడి శ్రీనివాసరావు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్‌ని కలిశారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వీరంతా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటికే వీరంతా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై అసంతృప్తితో తిరుగుబావుటా జెండా ఎగురవేశారు. పలు దఫాలుగా నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సుమావేశాలు ఏర్పాటు చేశారు. సిఎం జగన్ ముద్దు... ఎమ్మెల్యే కిరణ్ వద్దు అంటూ బహిరంగంగా నిరసన ర్యాలీలు ప్రదర్శనలు చేపట్టారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి జగన్ వైసిపి ప్రతినిధుల సమావేశంలో మార్చి నెలలో ఎన్నికలకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పుడు వైసిపి ఎచ్చెర్ల అసమ్మతి నాయకులంతా కలిసి విజయసాయిరెడ్డిని కలిసి ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తిని వ్యక్తం చేశారు. కిరణ్‌కి టిక్కెట్ ఇవ్వకుండా ఉండేందుకు వీరు ప్రయత్నాలు చేసినట్లుగా తెలుస్తోంది. అనంతరం రాష్ట్ర సోషల్ మీడియా హెడ్ సజ్జల భార్గవరెడ్డిని కూడా కలిసి అసమ్మతిని తెలియచేసినట్లుగా తెలిసింది. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ఈ గ్రూపుల గోలతో వైసిపిలో గుబులు రేపుతోంది. వీరితో పాటు వైసిపి సోషల్ మీడియా వారియర్ పతివాడ గురునాయుడు, డోల సాయి ఉన్నారు.

పాలాభిషేకాలతో స్టేడియం నిర్మాణం పూర్తి కాదు

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

'ఆలూ లేదు... చూలు లేదు... కొడుకు పేరు సోమలింగం' అన్న చందంగా కోడిరామ్మూర్తి స్టేడియంలో వైసిపి సంబరాలు ఉన్నాయని, నాలున్నరేళ్లుగా మంత్రులుగా ఉన్న ధర్మాన సోదరులు దీన్ని ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పగలరా? అని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ప్రశ్నించారు. విశాఖ-ఎ కాలనీలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నర ఏళ్లుగా అతీగతీ లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. ఇప్పటి వరకు ధర్మాన సోదరులు మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ధర్మాన సోదరులు తమ ఉనికిని చాటు కోవడానికి స్టేడియం నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు విడుదల చేశారని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. జగన్ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి పనీ ప్రారంభించడం, సంబరాలు చేసుకోవడం, మరుసటి రోజు పనులు అక్కడితో ఆగిపోవడం ధర్మాన హయాంలో ఇటీవల పరిపాటిగా మారిందని విమర్శించారు. గతంలో రాగోలులో 200 మీటర్ల రోడ్డు వేసి సంబరాలు చేసుకొని తరువాత మిగిలిన రోడ్డును అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. కార్యక్రమంలో గార టిడిపి మండల అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి, వాడాడ మాజీ సర్పంచ్ శిమ్మ శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు గురుగు లక్ష్మణరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి చెన్న రమణ, రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొండు శంకర్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని కొత్తూరులో జలజీవన్ మిషన్, ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకంలో భాగంగా మంజూరైన పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ రూ.24 లక్షలతో గ్రామంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, నాయకులు దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి ఉషారాణి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తుంగపేట బిసి కాలనీలో సిసి రోడ్డు, కాలువ నిర్మాణానికి ఎంపిపి కిల్లి ఉషారాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. కాలనీలో రహదారి సమస్యపై జులై 26న 'చినుకు పడితే చిత్తడే' అంటూ 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్థానిక వైసిపి నాయకులు స్పందించి స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రూ.8 లక్షల ఎంపిపి నిధులు మంజూరు చేయించారు. చిన్నపాటి చినుకులు పడితే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లమని, ఎట్టకేలకు సిసి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టడంపై కాలనీ వాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల వేణుగోపాలం, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, కూన లక్ష్మణరావు, బొడ్డేపల్లి బాలకృష్ణ, పైడి పాలయ్య పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని అచ్చిపోలవలసలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కింతలి రహదారి నుంచి అచ్చిపోలవలసకు రూ.1.20 కోట్లతో నిర్మించిన బిటి రహదారిని ప్రారంభిస్తారని అన్నారు. అలాగే జలజీవన్ మిషనల్ కార్యక్రమంలో భాగంగా రూ.51 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటా కుళాయిలను ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొంటారని చెప్పారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదువుతోనే జీవనశైలిలో మార్పు సాధ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కుటుంబంలో ప్రతి ఒక్కరూ చదువుకుని తమ జీవనశైలిని మార్చు కోవాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ దానేటి శ్రీధర్ పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో 35 మంది విద్యార్థులకు చిక్కోలు ఎక్సలెన్స్ అవార్డుల పేరిట మంగళవారం ఆర్థికసాయాన్ని అందజేశారు. జిల్లాలో డిగ్రీ, మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నికల్, ఐటిఐ ఏ వృత్తి కోర్సులు చదువుతూ... ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకుంటామని తెలిపారు. రూ.20 లక్షలతో దానేటి శ్రీధర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశానని అన్నారు. ఈ ట్రస్టు ద్వారా ఆర్థికసాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్వపు డిఇఒ బి.మల్లేశ్వర రావు, చైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ జామీ భీమశంకర్, జగన్, రమణమూర్తి, మోహన్, చలం పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్

బహుమతులను అందజేస్తున్న మధుసూదన్

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్‌లో ఈనెల 4న ప్రారంభమైన అంతరిక్ష వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ వారోత్సవాల్లో అంతరిక్ష పరిశోధనలు, స్పుత్నిక్ మొదలు, చంద్రయాన్-3 వరకు అంతరిక్షంలో పరిశోధనలు చేస్తున్న వ్యాయగాములు, ర్యాకెట్ తయారీ, రాకెట్ విశిష్టత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్పేష్ సైన్సుపై విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం స్కూల్ చైర్మన్ డాక్టర్ కమినేని మధుసూదన్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు పి.రామారావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ సిఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు అన్నారు. గ్రామంలోని మంగళవారం గడపగడపకు బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అరెస్టు, వైసిపి పాలనలో ధరల భారాల గురించి వివరిస్తూ పోస్టర్లను అందజేశారు. ఈ నాలున్నరేళ్లలో సిఎం జగన్ ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నెత్తిన అధిక భారాన్ని వేశాడని అన్నారు. ప్రజలకు ఒక చేత్తో రూ. వంద ఇచ్చి... మరో చేత్తో రూ.వెయ్యి లాగేసుకుంటున్నాడని వివరించారు. అలాగే మండలంలోని కొర్లకోటలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యాన వైసిపి పాలన వైఫల్యాలపై పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి మల్లేశ్వరరావు, వడ్డాది గురుమూర్తి, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, ఉప సర్పంచ్ సువ్వారి కృష్ణారావు, గొండు రవి పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లిలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు ఆధ్వర్యాన మంగళవారం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టును నిరసిస్తూ, వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అరాచకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్లను అందజేస్తున్న శ్రీరంగనాయకులు

మాట్లాడుతున్న మురళీకృష్ణారావు

27న ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

రణస్థలం రూరల్ : ఓటర్ల జాబితా ముసాయిదా జాబితా విడుదల ఈ నెల 27న ఉంటుందని, ఆ తర్వాతైనా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎం.మురళీకృష్ణారావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరులో ఓటరు నమోదు, ఇంటింటా సర్వేలో వివక్ష చూపించారని టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఇలాంటివి ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్న సమయంలోనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పుడు ఆ ప్రక్రియ ముగిసిందని, అయినా ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. ముసాయిదా ప్రకటన వరకు కొత్తగా ఓటరు నమోదు కుదరదని, ఆన్‌లైన్ సైట్ నిలిపేశారని అన్నారు. తర్వాత మళ్లీ చేర్పించుకోవచ్చన్నారు. సమావేశంలో తహశీల్దార్లు వేణుగోపాల్, సత్యనారాయణ, డిటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న వైద్యులు స్వరాజ్యలక్ష్మి

విరివిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- పలాస

గ్లోబల్ వార్మింగ్ వల్ల రుతువులు క్రమం తప్పి కాలుష్యం పెరిగి వాతావరణం వేడెక్కితుందని, దీనికోసం పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డాక్టర్ ఎం.స్వరాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదంచలలో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన ఎంపిడిఒ రమేష్‌నాయుడుతో కలసి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలే మనిషికి జీవనాధారమని, మనిషి పుట్టక నుంచి మృతి చెందే వరకూ మొక్కల పాత్ర చాలా ఉంటుందని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీనారాయణ, సర్పంచ్ రామారావు, వైస్ ఎంపిపి తెలగాన శ్రీరాములు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాలరావు, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, కార్యదర్శి రవి, సత్యవతి, సూర్యప్రసాద్, తేజేశ్వరి, శిరీష, వెంకటరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం కంటయ్య

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

పొందూరు : మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ, 10వ తరగతిలోని మెరిట్ విద్యార్థులకు మంగళవారం విశాఖపట్నంలో ఉంటున్న జుత్తు సింహాచలం ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఎన్‌సిఇఆర్‌టీ తయారు చేసిన గణితం, సైన్స్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్స్‌ను పోస్టల్ ద్వారా పాఠశాలకు అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్స్‌ను ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య అందజేశారు. రెండేళ్లుగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఆయనకు ఉపాధ్యాయులు రావాడ పాపారావు, సాయికుమార్, పూజారి హరిప్రసన్న, చౌదరి వేణుగోపాల్, ధన్యవాదాలు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- నందిగాం

నందిగామ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు సీనియర్ సహాయకులు ఇ.సింహాచలంను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి కరువు మండలంగా ప్రకటించి రైతులను న్యాయం చేయాలని కోరారు. అలాగే గ్రామాల్లో టిడిపికి చెందిన ఓట్లను బిఎల్‌ఒలు తొలగించినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. దీనిపై పరిశీలించి ఓటు హక్కు కల్పించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పి.అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఓలా చంద్రశేఖరరావు, మదన్‌గౌడ్, కూర్మారావు, టి.మహేష్ పాల్గొన్నారు.

రాజేష్‌కు నివాళి

ఇచ్ఛాపురం : ఇటీవలే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువ వ్యాపారవేత్త ప్రత్తి రాజేష్‌కు గాంధీ పార్కు, టూరిజం పార్కు సెటిల్ టీమ్ బృందం ఘనంగా నివాళ్లర్పించారు. స్థానిక గాంధీ పార్కు వద్ద మంగళవారం సంతాప సభ నిర్వహించారు. ఆత్మీయుడిని కోల్పోయామని విచారణం వ్యక్తం చేశారు. ముందుగా రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అన్నదానం, దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజవరి గ్రౌండ్ వాకర్స్ మెంబర్లు, బాలికోన్నత హైస్కూల్ షట్టల్ ప్లేయర్స్ రాజేష్, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న స్నేహితులు

మానసిక రుగ్మతలను జయించాలి

శ్రీకాకుళం అర్బన్ : పళ్లు అందజేస్తున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతిఒక్కరూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా న్యాయ సేవధికారి సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురసరించుకుని నగరంలోని బెహరా మనోవికాస కేంద్రాన్ని సందర్శించి అందున్న వసతులను పరిశీలించారు. ఈయనతో పాటు హాజరైన న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్ కేంద్రం నిర్వహకులకు బియ్యం, పళ్లు అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు శ్యామల, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తీ మానసిక రుగ్మతలను జయించి ఆరోగ వంతమైన జీవితాన్ని అందుకోవాలని చార్టెట్ అకౌంట్ బరాటం విశ్వేశ్వరరావు సూచించారు. నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో వరల్డ్ మెంటల్ డే సందర్భాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, నటుకుల మోహన్, జోనల్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రెటరీ రామ్‌గోపాల్, ట్రెజరర్ శిల్లా మణి పాల్గొన్నారు.

గార హైస్కూల్, హాస్టల్ పరిశీలన

గార మండల కేంద్రంలో జెడ్‌పి హైస్కూల్, ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్ కాంప్లెక్స్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు సందర్శించి వసతులను పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా బిసి వెల్ఫేరు అధికారి ఇ.అనురాధ, ఇన్‌ఛార్జి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.సురేష్, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ ఉన్నారు.

టెక్కలి : సమాజంలో అంగవైకల్యాన్ని శాపంగా పరిగణించకూడదని, అది ఒక మానసిక రుగ్మతగా పరిగణించి మానసిక వికలాంగులను ప్రేమతో ఆదరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి మల్లా తేజ్‌చక్రవర్తి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక వికాలంగుల హక్కులను

టెక్కలి : మాట్లాడుతున్న జడ్జి తేజ్‌చక్రవర్తి

పొందడానికి కావాల్సిన చట్టాలపై అవగాహన అవసరమని అన్నారు. అనంతరం వికలాంగులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ, ఎంఇఒలు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, భవిత కేంద్రం నిర్వాహకులు అట్టాడ మన్మథరావు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక దినోత్సవాన్ని రిమ్స్ వైద్య కళాశాలలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టరు ప్రెజెంటేషన్, వ్యాసరచన, రంగోలి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.కళావతమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కె.పద్మావతి, అసిస్టెంటు ప్రొఫెసర్ ఎన్.మిబేల్, డి.ఉష పాల్గొన్నారు.

సభ్యులకు గౌరవం ఇదేనా?

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సభ్యులకు కనీస గౌరవం లేకుండాపోతుందని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ జరుగుతున్న కార్యక్రమాలపై తమకు తెలియజేయలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే సచివాలయాలకు ఎటువంటి సమీక్షలు నిర్వహించడం లేదని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం అయ్యేలా చూడాలని తెలియజేశారు. పడ్డలో తాగునీటి సమస్య ఉందని గ్రామ సర్పంచ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పెద్దపద్మాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మెళియాపుట్టి పొలాలకు సాగునీరు విస్తరించేలా చూడాలని స్థానిక ఎంపిటిసి ప్రతినిధి జయముని రావు కోరారు. అలాగే

మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ

ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన రుషి కోరారు. పిచ్చిమొక్కల వల్ల మలుపులు వద్ద రోడ్డు ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, పల్లి యోగి, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభం, ట్రై కార్ డైరెక్టర్ ప్రతినిధి ఎస్.సుభాష్, అలికాన మాధవరావు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం

మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత

ఆమదాలవలస : పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయాన్ని పొందవచ్చునని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత తెలిపారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు షెడ్యూల్ కుల ఉప ప్రణాళిక కింద మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టగొడుగులో మంచి పోషకాలతో కూడిన ఆహారం ఉందన్నారు. అందులో మాంసకృతులు, నీరు, పొటాషియం, మాంగనీసులు లభ్యమవుతాయని సూచించారు. పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణను తీసుకొని మెళకువలు జాగ్రత్తలు పాటిస్తే చాలా లాభదాయకంగా ఉంటుందని అన్నారు. యువతకు మంచి ఉపాధి అవకాశమని వివరించారు. పుట్టగొడుగులలో వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయవచ్చునని, మార్కెట్లో వాటికి మంచి డిమాండ్ ఉందని వివరించారు. పుట్టగొడుగులతో సూప్, పౌడర్, పచ్చడులు, బేకరీ ఉత్పత్తుల్లో కూడా దీన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ, సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, వాతావరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ బి.మౌనిక, నిక్ర పథకం రిసార్ట్స్ పర్సన్ శిల్ప, రాజేష్, భరద్వాజ్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు అండ

టెక్కలి : నాయీబ్రహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ముంగండి రమణమ్మ అన్నారు. టెక్కలి, పలాస సబ్‌డివిజన్ పరిధిలోని నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు మంగళవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నాయీబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గుర్తింపుతో పాటు జగనన్న చేదోడు పథకం ద్వారా దుకాణానికి రూ.పది వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారని అన్నారు. రూ.150 యూనిట్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తుందని

గుర్తింపు కార్డులు అందుకున్న వాయిద్య కళాకారులు

అన్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదీనంలో ఉన్న దేవాలయాల్లోని కళ్యాణ కట్టలో నాయీబ్రాహ్మణులకు గుర్తింపు నిచ్చామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరరావు, రమణమూర్తి, కృష్ణప్రసాద్, వెంకటరావు, ఇప్పిలి చిన్నారావు, వీరాస్వామి పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారంతో ఆరోగ్యానికి మేలు

వజ్రపుకొత్తూరు : బలవర్ధకమైన ఆహారంతో ప్రతి ఒక్కరికీ మేలు చేకూరుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కంబలరాయుడుపేటలో అంగన్వాడీ ఆధ్వర్యాన నిర్వహించిన పౌష్టికాహారం స్టాళ్లను మంగళవారం పరిశీలించారు. రకరకాల పదార్థాల తయారీ విధానం అడిగి తెలుసుకున్నారు. సొంతంగా తయారీ చేసి వినియోగించిన పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ఫాస్ట్ ఫుడ్ ప్యాకింగ్ ఫుడ్ వల్ల అనారోగ్యానికి గుంపుతారని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి, సర్పంచ్ చిరంజీవి, ఎంపిటిసి కారి వెంకటరావు, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పలాస : పలాస సత్యసాయి ఆలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య నిపుణులు జాక్సన్ వంద మంది నేత్రాలను పరీక్షించి 60 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ముందుగా నేత్ర వైద్య శిబిరాన్ని కన్వినర్ డోకి జగదీశ్వరరావు ప్రారంభించారు సత్యసాయి ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, మళ్ల

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి జాక్సన్

శరత్ బాబు, కృష్ణస్వామి, కౌంతేయుడు, కొండలరావు, కామేశ్వర్ మాస్టార్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

మందస : రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్తా అప్రమత్తంగా ఉంటూ టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి అక్రమ మార్గాలను ఎంచుకుందన్నారు. ఇప్పటి నుంచే ప్రతి టిడిపి కార్యకర్తా చైతన్యంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులను క్లిష్ట పరిస్థితులోకి నెట్టి ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ వెర్ఫికేషన్ పక్కతోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ఏమరపాటుగా ఉండకుండా ఓటర్ జాబితాపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దుర్యోధన, లబ్బ రుద్రయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి దాసరి తాతారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మెళియాపుట్టి : విద్యుత్ లైన్లు మరమ్మతులు మంగళవారం నిర్వహిస్తున్నామని, ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెళియాపుట్టి సబ్ స్టేషన్ పరిధిలో మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, పెద్దలక్ష్మీపురం, జోడూరు, జాడుపల్లి, పెద్దపద్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణం తనిఖీ

కొత్తూరు : రైతులకు పురుగు మందులు విక్రహిస్తే రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని మండల ఎఒ ఎన్.శ్రీనివాసరావు సూచించారు. పాలకొండ రోడ్డులోని గుడ్ల కృష్ణారావుకు చెందిన పురుగు, ఎరువులు మందుల షాపును మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పురుగు మందుల నమూనా సేకరించి తిరుపతిలోని ప్రాంతీయ కోడింగ్ కేంద్రానికి పంపించారు. పురుగు మందుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లు ధ్రువీకరణ జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో పాటు వ్యవసాయ. విస్తరణ అధికారి బూడిద రమేష్ వున్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

నరసన్నపేట : మండలంలోని తామరపల్లి దళిత సర్పంచ్ ప్రతినిధి ముచ్చ గణేష్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని ఐక్య వేదిక అధ్యక్షులు ఎం.అప్పల నాయుడు కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ సింహాచలంను మంగళవారం వినతిపత్రం అందజేశారు. సభ్యులు టి.గవరయ్య, కె.సూర్యనారాయణ, జి.త్రినాథరావు, సిహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్‌ఎం అప్పలస్వామి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈ ఏడాది పదో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలస్వామి అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు వారి తల్లితండ్రులకు తెలియజేస్తున్నామని చెప్పారు.

మట్టి నమూనాలను సేకరిస్తున్న అధికారులు

బాహుదా వంతెన పరిశీలన

ఇచ్ఛాపురం : పట్టణంలో శిథిలావస్థలో ఉన్న బాహుదా రోడ్డు వంతెన సామర్థ్య పరీక్షలకు రహదారులు, భవనల శాఖ అధికారుల బృందం మంగళవారం చేపట్టింది. ఆర్‌బి డిఇ రామినాయుడు, ఎఇ మోహనరావు, ఇతర సాంకేతిక నిపుణులు బృందం బాహుదా వంతెన పరిస్థితిపై పరిశీలించారు. ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ సత్యనారాయణ ఆదేశాల మేరకు వంతెన సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. కూలిన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి భారీ వాహనాల మినహా మిగిలిన వాహనాలు రాకపోకలు సాగించే విధంగా రోడ్డు కల్పించారు. కూలిన వంతెన సమీపంలో కొత్త వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పాత వంతెన సామర్థ్య పరీక్షలకు సిద్ధం చేశారు. ఈ పరీక్షల వల్ల ఇంకా ఎంత కాలం ఈ రోడ్డు వంతెన సేవలు అందించే అవకాశం ఉంటుందో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న రామకృష్ణనాయుడు

ఎఫ్‌పిజి సభ్యులకు శిక్షణ

జి.సిగడాం : స్థానిక ఐకెపి కార్యాలయంలో మంగళవారం ఎఫ్‌పిజి గ్రూపు సభ్యులకు ఎపిఎం రెడ్డి రామకృష్ణనాయుడు మంగళవారం శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు రైతు ఉత్పత్తిదారుల మహిళా సంఘ లీడర్లకు శిక్షణ ఇచ్చారు. గ్రూపులు పుస్తక నిర్వహణ, గ్రూపు నిర్వహణ, గ్రూపు పొదుపు, అప్పులు, చెల్లింపులపై అవగాహన కల్పించారు. వివిధ ప్రభుత్వ సేవల సద్వినియోగంపై, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిసి మురళి, మంగమ్మ, అకౌంటెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

పూర్తయిన పనులను పరిశీలిస్తున్న ఎంపిపి దీప

'నాడు-నేడు' పనులు పరిశీలన

బూర్జ : మండలంలోని నిర్వహిస్తున్న నాడు-నేడు పనుల్లో నాణ్యత కొరవడితే ఉపేక్షించేది లేదని ఎంపిపి కె.దీప హెచ్చరించారు. మండలంలోని లక్కుపురం ప్రాథమిక పాఠశాల్లో మొదటి ఫేస్‌లో చేపడుతున్న నాడు-నేడు పనులను మంగళశారం పరిశీలించారు. మరుగుదొడ్లల్లో ఏర్పాటు చేసిన పైపుల ద్వారా నీరు సక్రమంగా రావడం లేదని, చేతులు, భోజనం ప్లేట్లను శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన పైపులు పాడై వృథాగా పోతున్న తాగునీటిని గుర్తించారు. ప్రధాన గేటు పనులు పూర్తిస్థాయిలో కాలేదని, సెప్టిక్ ట్యాంకు సక్రమంగా నిర్మించలేదని లోపాలను గుర్తించారు. సంబంధిత అధికారులు గుర్తించి నిలిచిన పనులను పూర్తి చేయాలన్నారు. ఈమె వెంట ప్రధానోపాధ్యాయుడు కె.రాజేశ్వరరావు ఉన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపిడిఒ చంద్రకుమారి

వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

మెళియాపుట్టి : మండలంలో పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందుకుగాను ఐదు గ్రామ పంచాయతీ సచివాలయాలకు సంబంధించి ఐదు పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడుగురు అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్టుగా ఎంపిడిఒ తెలిపారు. పెద్దపద్మాపురం, పెద్దలక్ష్మీపురం, జాడుపల్లి, కేరాసింగి, వసుంధర గ్రామ సచివాలయాల నుంచి హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు.

బిజెడి నాయకుల పాదయాత్ర

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో బిజెడి నాయకులు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సిఎం నవీన్ పట్నాయక్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రొక్కం చలపతిరావు, కాశీనగర్ ఎన్‌ఎసి అధ్యక్షులు మేడిబోయిన సుధారాణి, ఉపాధ్యక్షులు రఘురాం సాహు, రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌నాయక్, మారుత్ పాల్, బసంత్‌దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, పట్టణ యువజన నాయకులు రాజేష్ మిషాల్, పట్టణ మహిళా అధ్యక్షులు రొక్కం సుజాత పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న నాయకులు